సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 28 । డిసెంబర్ । 2024



మహిమాన్వితం.. మహాప్రసాదం

శ్రీ ఈశ్వరీదేవి మఠంలో ఆరు రోజుల పాటు కనుల పండువగా నిర్వహించిన ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి.

-8లో



తుపాకీ పేలుళ్ల కేసులో నిందితుడి అరెస్ట్

ఈ నెల 21న జరిగిన నాటు తుపాకీ పేలుళ్ల కేసులో నిందితుడిని రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి తుపాకీ స్వాధీనం చేసుకున్నారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.280
రెండోరకం	రూ.140	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 81 మెట్రిక్ టన్నులు



కూటమి కుతంత్రంపై తిరుగుబాటు

- పెంచిన విద్యుత్ చార్జీలపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు
- పాల్గొన్న రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీ



రాజంపేట ఏపీఎస్పీడీసీఎల్ డీఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాజ్యసభసభ్యుడు మేడా రఘునాథరెడ్డి

సాక్షి రాయచోటి: అధికార కూటమి సర్కార్ కుతంత్రాలపై తిరుగుబాటు మొదలైంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి అధికారంలోకి రాగానే ప్రజల నెత్తిన పిడుగు వేయడంపై ప్రజలు భగ్గుమంటున్నారు. ఏదో చేస్తామని...ఏమి చేయకుండా సామాన్యుడి తలపై భారం మోపడంపై ప్రజల్లో ఉద్యమబాట మొదలైంది. అధికారంలోకి వచ్చి ఆరేడు నెలల కాకమునుపే ప్రజలకు తిప్పలు తెచ్చిపెడుతున్న సర్కార్‌పై వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టింది. శుక్రవారం అన్నమయ్య జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నేతలు నిరసనల సెగ ప్రభుత్వానికి తగిలేలా ఉద్యమించారు.

నిరసనల సెగ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున కరెంటు ఉద్యమం చేపట్టారు. సర్కార్ పెంచిన ఇంధన చార్జీలతోపాటు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎక్కడ చూసినా అన్ని నియోజకవర్గాల్లోనూ ప్లకార్డులు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు.

- రాజంపేటలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.
- జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి వినతిపత్రాన్ని సమర్పించారు.
- తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోటలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీతోపాటు విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు అందించే వరకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.
- రైల్వేకోడూరులో మాజీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు నేతృత్వంలో భారీ జనంతో పట్టణంలో ర్యాలీతోపాటు అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. రైల్వేకోడూరులో ఎక్కడ చూసినా జనజాతర కనిపించింది.
- పీలేరు కూడా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ శ్రేణులు ర్యాలీ నిర్వహించి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు.
- అలాగే మదనపల్లెలో నరేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి అనంతరం ట్రాన్స్‌కో అధికారికి విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వినతించారు.

కదం తొక్కిన శ్రేణులు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలతోపాటు అధికారులకు వినతిపత్రాలు సమర్పించే వరకు పార్టీ శ్రేణులతోపాటు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభించింది. రాయచోటిలో ప్రధానంగా మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శనరెడ్డి, లీగల్ సెల్ ప్రతినిధి జిల్లా సుదర్శన్‌రెడ్డి పాల్గొనగా, రాజంపేటలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, రాజంపేట వైఎస్సార్ సీపీ నేత ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపాల్గొన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, కోడూరు వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, టూరిజం శాఖ మాజీ డైరెక్టర్ సాయి కిశోర్‌రెడ్డిలు పాల్గొన్నారు. మదనపల్లెలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీ ఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీమ్ అస్లం, కార్యకర్తలు పాల్గొన్నారు. పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో కూడా పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కరెంటు బాదుడును ఉపసంహరించుకోవాలి

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట: కూటమి ప్రభుత్వం ప్రజలపై రుద్దిన కరెంట్ బాదుడును వెంటనే ఉపసంహరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం రాజంపేటలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డితో కలిసి కరెంటు చార్జీల పెంపు నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై మోయలేని భారం పెట్టడం ప్రజావ్యతిరేక పాలన అనిపించుకుంటుందన్నారు. ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత పెల్లుబుకుతోందన్నారు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వాలు, పాలకులు పని చేయాలే కానీ, వారిని ముక్కుపిండి వసూలు చేసి ఖజానా నింపుకోవాలనుకోవడం సరికాదన్నారు. కరెంటు చార్జీల పెంపు వల్ల అనేక ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. వినియోగదారులపై మోపిన రూ.15, 485.36 కోట్ల చార్జీల బాదుడుకు స్వస్తి చెప్పాలన్నారు. దళితుల కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. దళితులు ఓట్లు వేయలేదన్న అక్కసుతో వారిపై కక్షసాధింపు ప్రభుత్వానికి పనికిరాదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కరెంటు చార్జీల పెంపు నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. పెంచిన చార్జీలను ఉపసంహించుకోకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం అవుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

- కార్యక్రమంలో ఆకేపాటి సోదరుడు అనిల్‌రెడ్డి, మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్ చైర్మన్ మర్రిరవి, నేతలు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కృష్ణారావు యాదవ్, పాలగిరి సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ డీఆర్వో ఈశ్వరయ్య, వడ్డె రమణ, రక్కాసి శ్రీవాణి, ఏకుల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి: ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి,జెడ్పీవైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తదితరులు

భారీ వర్షంలోనూ పోరాటం

జిల్లాలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళనలు చేపట్టకముందే...శుక్రవారం ఉదయం నుంచి తుంపెర వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం 9.30 గంటల నుంచి తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేటలలో వర్షం జోరు పెంచింది. అయినప్పటికీ పార్టీ నేతలు, కార్యకర్తలు, శ్రేణులు జోరు వర్షంలోనూ గొడుగులతో కొందరు, వర్షంలో తడుస్తూ, నడుస్తూ మరికొందరు నిరసన చేపట్టారు. నినాదాలతో హోరెత్తిస్తూ వర్షంలో ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వం దిగివచ్చి చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.



బి.కొత్తకోట నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



పీలేరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు



రైల్వేకోడూరు: రాఘవరాజపురం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు



మదనపల్లె ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



అరిగెల భవ్య

నందలూరు: లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అరిగెల భవ్య జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు శివరాం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ ఈనెల 21,22 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిందని తెలిపారు. చెన్నైలో ఈనెల 28,29,30,31 తేదీల్లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో భవ్య పాల్గొంటుందన్నారు.విద్యార్థినికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కుంభమేళా కోసం ప్యాసింజరు రైళ్లు రద్దు

కలికిరి: వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగనున్న కుంభమేళా -2025కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులను తరలించడానికి నార్త్ సెంట్రల్ రైల్వేకి ఖాళీ ట్రెన్‌లు అవసరమైనందున సికింద్రాబాద్ సెంట్రల్ రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలో 5 ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి కుంభమేళాకు కేటాయించినట్లు సికింద్రాబాద్ సెంట్రల్ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో తిరుపతి-కదిరిదేవరపల్లి(07589), గుంతకల్-తిరుపతి (07655), తిరుపతి-హుబ్లీ (07657) ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు, కదిరిదేవరపల్లి-తిరుపతి(07590), తిరుపతి-గుంతకల్ (07656), రైళ్లను ఈ నెల 29 నుంచి మార్చి నెల 1వ తేదీ వరకు రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి నుంచి పాకాల మీదుగా పీలేరు, కలికిరి, మదనపల్లి రోడ్, ములకలచెరువు, తనకల్లు, ధర్మవరం, అనంతపురం మీదుగా గుంతకల్ వరకూ తిరిగే నాలుగు ప్యాసింజర్ రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడనున్నారు. ధర్మవరం నుంచి తనకల్లు, కదిరి, ములకలచెరువుల నుంచి తిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి అందరికి అందుబాటులో ఉన్న ఈ ప్యాసింజర్ రైల్లు రద్దు కావడంతో రెండు నెలల పాటు భక్తులకు ఇక్కట్లు తప్పవు.

పులకించిన పులివెందుల



భారీగా తరలివచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

- మాజీ సీఎం వైఎస్ జగన్ నాలుగు రోజుల జిల్లా పర్యటన విజయవంతం
- రోడ్డు మార్గంలో బెంగుళూరు వెళ్తున్నారని తెలుసుకున్న కేడర్
- ప్రధాన రహదారిపైకి వచ్చి చేరిన అభిమానులు, ప్రజలు
- అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగిన వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: అభిమాన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల పర్యటనతో పులివెందుల పులకించింది. ఆపన్నహస్తం కోసం ఎదురుచూసిన వారికి భరోసా, అభిమానులకు అభయం, కేడర్‌కు ఉత్సాహం నింపింది. పల్లె ముంగిట్లోకి ప్రియతమ నాయకుడు రావడంతో గ్రామీణ ప్రజల ఆనందానికి అవధుల్లేవు. నాలుగు రోజులుగా నియోజకవర్గంలోనే ఉంటూ అటు కేడర్, ఇటు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో పరస్పర అభిమానం పోటెత్తింది. మరోవైపు సమస్యలు వింటూ నేనున్నాను.. అంటూ ధైర్యాన్ని కల్పించారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇలా అభిమాన నాయకుడు, కేడర్ మధ్య పరస్పర అభిమానం, ఆప్యాయతల మధ్య నాలుగు రోజుల పర్యటన ముగిసింది. ఉదయం నుంచి రాత్రి వరకూ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలకు అందుబాటులో ఉన్నారు. కుటుంబ సభ్యులతో క్రిస్మస్ వేడుకలు మినహా నాలుగు రోజులు పులివెందుల వాసులకు అందుబాటులో ఉండడంతో స్థానికులు వేలాది మంది ప్రత్యక్షంగా కలుసుకున్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు

తరలివచ్చిన శ్రేణులు...

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు రోజులుగా పులివెందులలో అందుబాటులో ఉన్నారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కేడర్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి ఒక్కరూ తమ అభిమాన నాయకునితో కలిసి మాట్లాడాలనే ఉత్సాహాన్ని ప్రదర్శించారు. పలకరించిన ప్రతి ఒక్కరు ఫోటో, సెల్ఫీ కోసం ఉత్సాహం చూపారు. రాత్రి వరకూ ఓపిగ్గా అందరితో మాట్లాడుతూ వారి సమస్యలు ఆలకించారు. జిల్లా వ్యాప్తంగా ముఖ్యనేతలతోపాటు కడప కార్పొరేటర్లు కుటుంబ సభ్యులతో సైతం తరలివచ్చారు. వారందరి యోగక్షేమాలు ఆయన తెలుసుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సైతం భరోసా నింపారు.



అభిమానులతో సెల్ఫీ తీసుకుంటూ...

వివాహ వేడుకలో..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఓ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

తాతిరెడ్డిపల్లెకు ముందే వచ్చిన పండుగ...

తాతిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వైఎస్ జగన్ హాజరయ్యారు. 30 కిలో మీటర్లు దూరంలో ఉన్న ఆ గ్రామానికి వెళ్లేందుకు ఏకంగా 6గంటల సమయం పట్టింది. అంతటి స్థాయిలో ప్రజలు దారి వెంబడి ఉండిపోయారు. మరోవైపు ఈ కార్యక్రమానికి వైఎస్ జగన్ హాజరవుతున్నారని తెలుసుకున్న తాతిరెడ్డిపల్లె గ్రామస్తులు బంధుగణంతో కలసి భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేశారు. ఇసుకేస్తే రాలనంతగా జనం వచ్చి చేరిపోయారు. రోడ్డుకు ఇరువైపులా రామాలయం వరకూ ఉండిపోయారు. వాహనంపై నుంచి అభివాదం చేస్తూ గ్రామస్తులను ఉత్సాహపరుస్తూ.. మాజీ సీఎం వైఎస్ జగన్ ముందుకు కదిలారు. సంక్రాంతికి ముందే ఈ గ్రామంలో పండుగ వాతావరణం వచ్చి చేరింది.



వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపుతున్న ప్రజలు



వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన అభిమానులు, ప్రజలు

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

– మరొకరికి గాయాలు

మదనపల్లె సిటీ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణం కదిరిరోడ్డు సంఘం ఫంక్షన్ హాలు వద్ద జరిగింది. గురువారం రాత్రి తంబళ్లపల్లె మండలం దండువారిపల్లెకు చెందిన బండి వెంకటరమణ(60), మురాషా(58)లు కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా సంఘం ఫంక్షన్ హాలు వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. వెంకటరమణ తలకు బలమైన గాయం కాగా మురాషావల్లికి చెయ్యి విరిగిపోయింది. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్సలు పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సుబ్బారెడ్డి

రాజంపేట : తాళ్లపాక గ్రామానికి చెందిన రైతు సుబ్బారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సుబ్బారెడ్డి దీపావళి పండుగకు జాన్‌డీర్ కంపెనీకి చెందిన ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. ట్రాక్టర్ కొనుగోలు చేసిన తర్వాత మైలేజ్ రాలేదని కంపెనీ సిబ్బందిని ప్రశ్నించాడు. తరుచూ ట్రాక్టర్‌లో సమస్యలు తలెత్తుండటంతో కంపెనీ సిబ్బంది నుంచి సరైన సమాధానం రాలేదు. మరోవైపు కంతు కట్టాలని వేధింపులు మొదలయ్యాయి. దీంతో జాన్‌డీఆర్ ఆఫీసులో గురువారం గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆయనను చికిత్స నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెడ్డెప్ప

గుర్రంకొండ : ఆటో బోల్తా పడి ముగ్గురికి తీవ్ర రక్త గాయాలైన సంఘటన మండలంలోని సరిమడుగు పంచాయతీ పుల్లావాండ్లపల్లెలో జరిగింది. శుక్రవారం దిగువ సరిమడుగు నుంచి గుర్రంకొండకు ఓ ఆటోలో ప్రయాణికులు బయలుదేరారు. గుర్రంకొండ వారపుసంత కోసం గ్రామస్తులు ఎక్కువగా ఆటోలో బయలుదేరారు. మార్గంమధ్యలో పుల్లావాండ్లపల్లె వద్దకు ఆటో చేరుకోగానే ముందు వైపు చక్రం ఆకస్మాత్తుగా నిలిచిపోవడంతో ఆటో అదుపుతప్పిబోల్తా పడిపోయింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న తోటరెడ్డెప్ప(70), సుగవాసి జయమ్మ(70) శనిక్కాయల దుర్గ(65)లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. బాధితులను హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. వీరిలో రెడ్డెప్ప పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించాల్సిందిగా వైద్యులు కోరారు. దీంతో రెడ్డెప్పను తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త దాడి

నిమ్మనపల్లె : కుటుంబాన్ని పట్టించుకోకుండా వేరే మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉండటంపై నిలదీసినందుకు భార్యపై భర్త దాడి చేసిన ఘటన నిమ్మనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. రాచవేటివారిపల్లె దళితవాడకు చెందిన లలితమ్మ ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. భర్త వేణుగోపాల్ తనను పట్టించుకోకుండా వేరే మహిళతో చనువుగా ఉంటూ.. పిల్లలు, కుటుంబ అవసరాలు పట్టించుకోకపోవడంతో నిలదీసింది. దీంతో ఆగ్రహించిన భర్త భార్యపై దాడి చేసి గాయపరిచాడు. గమనించిన స్థానికులు లలితమ్మను చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

పెండ్లిమర్రి : కొండూరు గ్రామానికి చెందిన మణికంఠ(28) శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... మణికంఠ తన ఇంట్లో బల్బుకు విద్యుత్ రావడం లేదని సరి చేస్తుడంగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

మహిమాన్వితం.. మహాప్రసాదం


భక్తులకు ప్రసాదం అందజేస్తున్న మఠాధిపతి తల్లి విజయమ్మ


దేవాలయ వాస్తుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న శిల్ప శాస్త్ర నిపుణులు

బ్రహ్మంగారిమఠం : 'జగన్మాత.. దీవించు తల్లీ' అంటూ భక్తులు వేడుకున్నారు. మహాదేవి ప్రసాదం కోసం వారు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. 'అమ్మవారి ప్రసాదం.. మహిమాన్వితం' అంటూ భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. శ్రీఈశ్వరీదేవి మఠంలో ఆరు రోజుల పాటు కనుల పండువగా నిర్వహించిన ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అమ్మవారికి మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజేశ్వరిదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేసి, విశేషంగా అలంకరించారు. అనంతరం మహాప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం, శ్రీఈశ్వరీదేవి మఠం సంప్రదాయాల ప్రకారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ద్వార పూజ చేశారు. బ్రహ్మంగారిమఠంలో ప్రసాదం తయారు చేసి, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం శ్రీఈశ్వరీదేవి మఠంలో ద్వార పూజ చేశారు. ప్రసాదం తయారు చేసి, మఠంలో రాసిగా పోసి భక్తులకు పంపిణీ చేశారు. ఈ ప్రసాదం దక్కడం తమ భాగ్యమని వారు ఆనంద భరితులయ్యారు. మహా ప్రసాదానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. 'నిద్ర పోవు వారికి, వద్ద లేని వారికి నా ప్రసాదం అబ్బదు' అని కాలజ్ఞాన వాక్యం. వివాహం, సంతానం లాంటి కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కాశీ గంగ, తిరుమల లడ్డూకు ఎంత ప్రత్యేకత ఉందో మఠం మహానివేదనకు అంత విశిష్టత ఉందని పెద్దల మాట. మఠాధిపతి శ్రీవీరశివకుమార స్వామి ప్రసంగిస్తూ శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన సమయాల్లో శ్రీ ఈశ్వరీదేవి స్వయంగా ప్రసాదం తయారు చేసి, భక్తులకు పంపిణీ చేసేవారని పేర్కొన్నారు. అలాగే అమ్మవారు దేశ పర్యటన సందర్భాల్లో పంపిణీ చేశారన్నారు. ఈ ప్రసాదం స్వీకరించడానికి భక్తులు అమితాసక్తి ప్రదర్శించే వారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి, సంకటితిమ్మాయపల్లెకు చెందిన పోలు ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి, ముక్కమల్ల భాస్కర్‌రెడ్డి, వీరపు ఉమాపతి, సుంకు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ వాస్తుపై అవగాహన

శ్రీఈశ్వరీదేవి మఠంలో దేవాలయ వాస్తుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తెనాలికి చెందిన స్మార్తాగమ వాస్తు జ్యోతిష అధ్యయనపరులు ఇడమకంటి జనార్ధన శివాచార్య, ప్రొద్దుటూరు శిల్పిబ్రహ్మ శిల్పశాలకు చెందిన కోరుగొమ్మి గురుబాలబ్రహ్మాచార్యులు, తెలంగాణకు చెందిన వాస్తు శిల్పి సాయిరాం పంజాల దేవాలయ వాస్తుపై వివరించారు. కవి పూసపాటి నాగేశ్వరరావు రచించిన జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి చరిత్రపై పూసపాటి శంకర్‌రావు వ్యాఖ్యానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విని తరించారు.

తంబళ్లపల్లెపై ప్రభుత్వం కక్ష సాధింపు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథడ్డి



బి.కొత్తకోట : తంబళ్లపల్లె ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నారనే అక్కసుతో.. ప్రభుత్వం అభివృద్ధి పనులపై కక్ష సాధిస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధిని నిలిపివేయడంపై టీడీపీ నేతలు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బి.కొత్తకోటలో పోరుబాట కార్యక్రమం తర్వాత మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెబుతూనే ప్రజలపై రూ.15,500 కోట్ల భారం మోపడం సిగ్గుచేటు కాదా అని నిలదీశారు. ప్రజలపై భారాన్ని తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. తంబళ్లపల్లెకు పరిశ్రమలు రావాలంటే విద్యుత్ సౌకర్యం, నీటి లభ్యత పుష్కలంగా ఉండాలని గత ప్రభుత్వంలో 1,217 కోట్లతో హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ విస్తరణ పని, ఆరు విద్యుత్ కేంద్రాలను మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే కూటమి ప్రభుత్వం పనులను రద్దు చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. గండికోట నుంచి 800 క్యూసెక్కుల కృష్ణా జలాలను తరలించేందుకు చేపట్టిన పనులు రద్దు చేసి తంబళ్లపల్లెకు అన్యాయం చేయడాన్ని టీడీపీ నేతలు నిలదీయాలని డిమాండ్ చేశారు. రైతాంగం కోసం చేపట్టిన ముదివేడు రిజర్వాయర్ నిర్మాణ దశలో ఉండగా నిలిపివేయించి రైతుల ఉసురు పోసుకుంటున్నారని అన్నారు. విద్యుత్ కేంద్రాలకు స్థలాలు కేటాయించి, నిధులు మంజూరు చేస్తే వాటి పనులు చేపట్టకుండా ఎందుకు రద్దు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. విద్యుత్ లోఓల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే కొత్తగా ఫీడర్లు ఏర్పాటు చేయించామని గుర్తు చేశారు. నియోజకవర్గ పేదలకు 18 వేల పక్కా గృహాలు మంజూరు చేయిస్తే వాటిని పూర్తి చేయించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతి పనులు రద్దు చేసుకుంటూ తంబళ్లపల్లె ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటూ తీవ్ర ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అభివృద్ధిని టీడీపీ నేతలు విస్మరించి సంపాదన చూసుకుంటే చాలు అన్న ధోరణితో ఉన్నారని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించి అభివృద్ధి కొనసాగేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలో అధికారుల వ్యవహారశైలి మారాలని సూచించారు. అధికారులు అందర్నీ సమానంగా చూడాలని, చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. లేనిపక్షంలో చట్ట పరిధిలో చర్యలు తీసుకోవడమేకాక అలాంటి అధికారులకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

తుపాకీ పేలుళ్ల కేసులో నిందితుడి అరెస్ట్

నాటు తుపాకీ, నల్లమందు, గుళ్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ చంద్రశేఖర్

రాయచోటి టౌన్ : ఈ నెల 21వ తేదీ శనివారం తెల్లవారుజామున జరిగిన నాటు తుపాకీ పేలుళ్ల కేసులో నిందితుడిని రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అర్బన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం గ్రామం కాటిమాయకుంట, గురికినివాండ్లపల్లెకు చెందిన ముడి రమణప్ప నాయుడు ఈ నెల 21వ తేదీ అడవి ప్రాంతానికి వేటకు వెళ్లాడు. అదే సమయానికి అదే గ్రామ చివర్లో గుడిసులు వేసుకొని (సంబేపల్లె గ్రామానికి చెందిన వారు ప్లాస్టిక్ వస్తువులు ఏరుకొని జీవనం సాగిస్తారు) జీవనం సాగించే నీలకంఠం హనుమంతు, రమణలు ఇద్దరు కూడా వేటకు వెళ్లారు. ముందుగా ముడి రమణప్ప నాయుడు అడవి జంతువుల కోసం ఉచ్చులు మాటు వేసి ఉన్నాడు. అదే ప్రాంతంలో వీరిద్దరు కూడా అడవి జంతువుల కోసమే రాత్రి 9 గంటల సమయంలో ఉచ్చులు తీసి ఇంటికి వెళ్లి తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో నిద్ర లేచి తాము వేసిన ఉచ్చులలో.. ఏవైనా అడవి జంతువులు పడ్డాయోమోనని చూసేందుకు వెళ్లారు. ముందుగా తాను వేసి (తన వైపు) కొంగు వైపు జంతువులు వస్తే నాటు తుపాకీ (తన తండ్రి కాలం నాటి తుపాకీ) తో కాల్చేందుకు మాటు వేసి సిద్ధంగా ఉన్న రమణప్ప నాయుడు... హనుమంతు, రమణల అలికిడిని చూసి ఏవో జంతువులు వస్తున్నాయని భావించి తుపాకీతో కాల్చాడు. ఈ కాల్పులలో హనుమంతుకు తీవ్రంగా గాయాలు కావడం తోపాటు రమణకు స్వల్ప గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన హనుమంతు చికిత్స పొందుతూ మరణించగా రమణ చికిత్స పొందుతున్నాడు. దీనిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ సాగించిన అర్బన్ ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, శ్రీనివాస నాయక్‌లు నిందితుడిని శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు హాజరు పెట్టారు. నిందితుడి నుంచి తుపాకీతోపాటు కాల్పులకు వాడిన నల్లమందు, తుపాకీలో వాడిన గుళ్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందిపై ఎస్పీ కొరడా

– ఒకరు సస్పెన్షన్? మరొకరిపై బదిలీ వేటు

రాయచోటి : విచ్చలవిడిగా జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలకు మద్దతు పలుకుతున్న పోలీసు సిబ్బందిపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చర్యలు చేపట్టి తనదైన మార్క్‌ను ప్రదర్శించినట్లు సమాచారం. అన్నమయ్య జిల్లా రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ కేంద్రంగా కొంత మంది పోలీసులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై ఎస్పీ కొరడా ఝుళిపించారు. అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లేలా దారితీసిన సంఘటనలో భాగమైన కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే పేకాట ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సహకారం అందిస్తున్న మరో కానిస్టేబుల్‌ను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇంకో కానిస్టేబుల్ ఆధీనంలో అసాంఘిక కార్యకలాపాలు అధికంగా జరుగుతున్నాయన్న వేగుల సమాచారం మేరకు.. చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలియవచ్చింది. శుక్రవారం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేగుల ద్వారా అందిన సమాచారం మేరకు కానిస్టేబుల్‌ను కొన్ని గంటల వ్యవధిలోనే రిలీవ్ అయి చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలను చేపట్టాలని ఆదేశాలు కూడా జారీ చేసినట్లు తెలిసింది. అలాగే మరో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయగా ఇంకో కానిస్టేబుల్‌పై చర్యలకు సన్నద్ధం అయినట్లు తెలియడంతో జిల్లాలోని పోలీసు యంత్రాంగంలో వణుకు మొదలైంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఆరుగురికి గాయాలు


వాహనంలో నుంచి బాధితులను బయటకు తీస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు అర్బన్ : తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, ఆరుగురు గాయాల పాలయ్యారు. నియోజకవర్గంలోని కోడూరు–చిట్వేలికి చెందిన ఏడుగురు జీవనోపాధి నిమిత్తం సంతలో గొర్రెలు కొనడానికి నెల్లూరుకు వెళ్లారు. జీవాలను తీసుకొని మ్యాక్స్ వాహనంలో తిరిగి వస్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తిమ్మిశెట్టిపల్లి పంచాయతీ తిట్లావారిపల్లికి చెందిన సోమయ్య అక్కడికక్కడే మృతి చెందారు. కోడూరు మండలానికి చెందిన సూర్యప్రకాష్, భాస్కర్, వెంకటయ్య, రమణయ్య, పెంచలయ్య.. చిట్వేలి మండలానికి చెందిన కట్టా ఈశ్వరయ్య, సుబ్రమణ్యం, పెంచలయ్య తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలాన్ని గూడూరు పోలీసులు పరిశీలించారు. బాధితులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

చిట్వేలి : ఒక వ్యక్తి ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రాజంపేట కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. గురువారం పుల్లంపేట మండలం వత్తలూరుకు చెందిన ఎరుకాళ్ల వెంకటేశ్వర్లు (32) భార్య, ఆమె తండ్రి వెంకటయ్య, ఆమె తమ్ముడు వంశీయులు వేధించడం వల్ల తన కుమారుడు ఎరుకాళ్ల వెంకటేశ్వర్లు పుల్లంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి ఎరుకాళ్ల రాములమ్మ ఈ నెల 26న చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారంతో తాను, సిబ్బంది శుక్రవారం పోలీసు వాహనంలో వెళ్తుండగా అగ్రహారం పంచాయతీ రాపూరు క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగా.. అక్కడ నిలబడి ఉన్న ముగ్గురు నిందితులు తమను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారని ఎస్ఐ తెలిపారు. చిట్వేలి మండలం గాంధీనగర్ వడ్డిపల్లికి చెందిన ఎరుకాళ్ల రేవతి (26), నాగవరం వడ్డిపల్లికి చెందిన కుర్రపోతుల వెంకటేష్ (49), నాగవరం వడ్డిపల్లికి చెందిన కుర్రపోతుల వంశీ (23)లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రాజంపేట కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఒంటిమిట్టలో మళ్లీ టీడీపీ వర్గ పోరు


వాగ్వాదం చేసుకుంటున్న ఇరు వర్గాల నాయకులు

- అధికారుల సమక్షంలోనే వాగ్వాదానికి దిగిన నాయకులు
- ఉద్రిక్తత నడుమ సాగిన రెవెన్యూ సదస్సు

ఒంటిమిట్ట : మండలంలో మరోసారి టీడీపీ వర్గ పోరు భగ్గుమంది. ఒంటిమిట్టలోని స్త్రీ శక్తి భవనంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం అధ్యక్షత వహించిన రెవెన్యూ సదస్సుకు ఇతర మండలాల వారు హాజరు కావడంతో.. విషయం తెలుసుకున్న రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గానికి చెందిన ఒంటిమిట్ట టీడీపీ నాయకులు రాష్ట్ర కల్లు గీత కార్మిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, ఆయన అనుచరులు రెవెన్యూ సదస్సుకు చేరుకున్నారు. ఇతర మండలాల వారు ఇక్కడ ఏం చేస్తున్నారని చమర్తి వర్గానికి చెందిన నాయకులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఒంటిమిట్ట రెవెన్యూ సదస్సులో ఒంటిమిట్ట వాసులకు ప్రాధాన్యత ఇవ్వరా? పక్క మండలం వారికి ఇక్కడ ఏమి అవసరం ఉందన్నారు. రెవెన్యూ సదస్సు పెట్టే ముందు స్థానిక టీడీపీ నాయకులకు సమాచారం అందివ్వరా అని రెవెన్యూ అధికారులను నిలదీశారు. ఇదిలా ఉంటే సుగవాసి ప్రారంభించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన వారు ఒంటిమిట్ట పంచాయతీకి చెందిన రైతులు కారని చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గం వారు అంటుంటే.. అప్పటికే సుగవాసి సమావేశంలో ఉన్న ఒంటిమిట్ట రైతులు తాము ఒంటిమిట్ట వారిమి కాదా అని పెద్ద కొత్తపల్లికి చెందిన కట్టా యానాదయ్య.. చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గం వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ ఏర్పడింది. తోపులాటకు దారి తీయడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో అక్కడే ఉన్న పోలీసులు అప్రమత్తం కావడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం సర్దుమనిగింది. ఇది ఇలా ఉంటే రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలపై అర్జీ ఇవ్వడానికి వచ్చిన రైతులు, భూ స్వాములు ఈ పరిస్థితులు చూసి ఇదేమి కర్మరా బాబు సమస్యలు తీర్చుకుందామని వస్తే.. టీడీపీ నాయకుల ఆధిపత్య పోరు ఎక్కువైందని అనుకుంటూ వెనుతిరిగారు. ఈ సదస్సుకు ఒంటిమిట్ట తహసీల్దార్ రమణమ్మ, రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు.

కడప మీదుగా అజ్మీర్‌కు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : తిరుపతి నుంచి కడప మీదుగా అజ్మీర్‌కు ప్రత్యేక రైలు నడపనున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి రెండో తేదీన (గురువారం) ఉదయం 7 గంటలకు బయలుదేరి నాలుగో తేదీన అజ్మీర్‌కు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. తిరిగి 9వ తేదీన అజ్మీర్‌లో బయలుదేరి శుక్రవారం రాత్రి 11 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు టౌన్, గద్వాల, మహబూబానగర్, కాచిగూడ, ఖాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్, కాగజ్‌నగర్, నాగపూర్, భోపాల్, ఉజ్జయిని మీదుగా అజ్మీర్ స్టేషన్లో ఆగుతుందన్నారు. ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్యాసింజర్ రైలు నంబర్ మార్పు

తిరుపతి–హుబ్లీ(07657), హుబ్లీ–తిరుపతి(07658) మధ్య నడిచే ప్యాసింజర్ రైలు నంబర్ మార్పు చేశారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 2025 జనవరి 1 నుంచి ఈ రైలు నంబర్లు 57401/57402గా మార్పు చేశారని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అలాగే తిరుపతి–హుబ్లీ మధ్య నడిచే ఈ రైలును ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు, అలాగే హుబ్లీ–తిరుపతి మధ్య నడిచే రైలు ఈ నెల 29వ తేదీ నుంచి మార్చి ఒకటో తేదీ వరకు రద్దు చేశారని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళా కారణంగా ఈ రైలును ఆ ప్రాంతంలో నడపనున్నారని వివరించారు.

అక్రమ పద్ధతుల్లో విదేశాలకు పంపడం నేరం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్ : ఉపాధి కోసం గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్' హాల్‌లో విదేశీ వ్యవహారాల శాఖ, ప్రొటెక్టర్ ఆఫ్ ఇమిగ్రంట్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రిజిస్టర్ ట్రావెల్ ఏజెంట్లు, అన్ రిజిస్టర్ ట్రావెల్ ఏజెంట్లతో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పేరిట పలువురిని అక్రమ పద్ధతుల్లో విదేశాలకు పంపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సరైన వీసా, ఇతర డాక్యుమెంట్లతో వెళ్లాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెంట్లను మాత్రమే సంప్రదించాలని పేర్కొన్నారు. అలాంటప్పుడే పని చేసే దేశాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా త్వరితగతిన పరిష్కరించేందుకు సకాలంలో జీతభత్యాలు, మెడికల్ ఇన్సూరెన్స్, మెటర్నిటీ, కుటుంబ వైద్య సౌకర్యం, ప్రమాద బీమా లాంటివి అందుబాటులో వుంటాయన్నారు. ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్స్ (పి.ఓ.ఈ) అధికారి అంగర రవికుమార్ మాట్లాడుతూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సురక్షిత, సక్రమ వలసలను ప్రజలకు చేరువ చేసేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏవైనా సమాచారాన్ని ఇబ్బందులు ఎదురైనా, అత్యవసరమైన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్: 1800113090 లేదా 011-26885021కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎస్‌బీ సీఐ టి.రెడ్డెప్ప, జిల్లాలోని రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్ ఏజెంట్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

అట్లూరు : మండల పరిధిలోని లింగాలకుంట దగ్గర గురువారం రాత్రి కారు ఢీకొని సంగటి సుబ్బమ్మ(70) అనే మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల కుంట ఎస్సీ కాలనీకి చెందిన సంగటి సుబ్బమ్మ రోడ్డు దాటుతుండగా బద్వేలు వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలైంది. ఆమెను ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఎస్సీ జనాభా వివరాలపై సోషల్ ఆడిట్

రాయచోటి (జగదాంబసెంటర్) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా, వారి వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారక అధికారి ఎన్.జయప్రకాష్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను ఈ నెల 26 నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఈ నెల 31వ తేదీ వరకు దీనిపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. తరువత జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10నే కులగణన తుది వివరాలను గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలి. ఈ మేరకు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.

మూడు దశలలో తనిఖీ

పేరు, ఆధార్ నెంబర్, పుట్టినతేదీ, వయస్సు ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి వ్యవసాయం, ఇతర వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ డేటాపై అభ్యంతరాలను వీఆర్‌ఓ స్వీకరిస్తారు. వీటిని మూడు దశలలో తనిఖీ చేస్తారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్‌ఓ పరిశీలించి వివరాలను ఆర్‌ఐకి నివేదిస్తారు. వీటిని ఆర్‌ఐ పునః పరిశీలించి తహసీల్దార్‌కు రెకమెండ్ చేస్తారు. తర్వాత తహసీల్దార్ వీఆర్‌ఓ, ఆర్‌ఐల నివేదికలో వివరాలను పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని పోర్టల్‌లో పొందుపరుస్తారు. పొందుపరిచిన వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాల్ని ర్యాండమ్‌గా తనిఖీ చేయిస్తారు. ఈ సోషల్ ఆడిట్‌ను కలెక్టర్, ఆర్డీఓలు పర్యవేక్షిస్తారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల పరిశీలన


మైనింగ్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు


అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

వేంపల్లె : వేంపల్లె, వేముల మండలాల్లో అక్రమ మైనింగ్‌లు ఉన్నాయని మైనింగ్ విజిలెన్స్ ఆర్‌ఐ రామసుబ్రహ్మణ్యం, జిల్లా మైనింగ్ ఆర్‌ఐ విమలమ్మ పేర్కొన్నారు. వారికి అక్రమ ముగ్గురాయి మైనింగ్‌లు ఉన్నాయని ఫిర్యాదు రావడంతో శుక్రవారం తమ సిబ్బందితో కలిసి మండలంలోని తాళ్లపల్లె గ్రామ పొలాల్లో ఉన్న మైనింగ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాళ్లపల్లి గ్రామ పొలాల్లో 214బి, 224 సర్వే నంబర్లలో కడపకు చెందిన ఎండీ నియామతుల్లా అనే వ్యక్తి ఎలాంటి లీజు లేకపోయినా అక్రమ మైనింగ్‌ను కొనసాగిస్తున్నాడని ముచ్చుకుంట్ల జగన్మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. గత 50 ఏళ్ల నుంచి ఫేక్ డాక్యుమెంట్లు చూపిస్తూ రెవెన్యూ, పోలీస్, కోర్టులకు డాక్యుమెంట్స్ ఇవ్వకుండా పక్కదారి పట్టిస్తూ అక్రమ మైనింగ్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు.1992లో జీవో ఎంఎస్ నంబర్ 429 ప్రకారం ఎవరైనా లీజులు మంజూరు చేయించుటకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ చేసిందన్నారు. అయితే దీని ఆధారంగా తాటిమాకులపల్లె గ్రామానికి చెందిన ముచ్చుకుంట్ల జగన్మోహన్‌రెడ్డి 214బి, 224 సర్వే నంబర్లలో మైనింగ్ లీజు కోసం 2010న దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆయనకు 2013లో ఆ సర్వే నంబర్లలో ముగ్గురాయి తవ్వకొనుటకు మైనింగ్ లీజు మంజూరైందన్నారు. కాగా నియామతుల్లా అధికార పార్టీ నాయకులతో చేతులు కలిపి 214బీ సర్వే నంబర్‌లో ప్రాంతం నుంచి చొరబడి 214సి సర్వే నంబర్ ప్రాంతంలో అక్రమంగా ముగ్గురాయిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2006లో 214సి, 214డి, 214 సర్వే నంబర్లలో కూడా ముగురాయి తవ్వకొనుటకు లీజు మంజూరైందని తెలిపారు. అయితే నియామతుల్లా అక్రమంగా మైనింగ్ చేస్తుండగా 2010లో హైకోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఫైనల్ హియరింగ్ స్టేజీలో ఉందన్నారు. కాగా హైకోర్టు ఇంట్రీమ్ ఆర్డర్ ఇచ్చినా కూడా నియామతుల్లా కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి మైనింగ్ అధికారులను అనుకూలంగా చేసుకుని 214బి సర్వే నంబర్ నుంచి 214సి లోనికి ప్రవేశించి అక్రమ మైనింగ్‌ను కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. విజిలెన్స్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నోటీసులు ఇచ్చారు. అయితే విజిలెన్స్ ఏడీ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు వచ్చి పరిశీలించి మరొక తేదీని ఇచ్చి సర్వే చేస్తామని చెప్పి వెళ్లిపోయారని తెలిపారు. వేంపల్లె, వేముల మండలాలలో 16 చోట్ల లీజు లేకున్నా.. ఉన్నట్లు రికార్డులు సృష్టించి ముగ్గురాయి మైనింగ్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. వీరందరూ ఎటువంటి లీజు లేకున్నా ప్రభుత్వానికి శిస్తు కట్టకుండా గండి కొడుతున్నట్లు సమాచారం.